
# మంచి అల్లుడు

-ఇలపావులూరి మురళీ మోహనరావు



''సాయంత్రం గోదావరి లో మా అమ్మ బయలు దేరుతున్నదట. రేపు ఉదయం స్టేషన్‌కు వెళ్ళి తీసుకు రాకూడదూ'' వెంకట్రావు గడ్డాన్ని నిమురుతూ అన్నది సుందరి.

''ఎందుకట?'' పరధ్యానంగా అన్నాడు వెంకట్రావు.

''దసరా పండక్కి''

''పండక్కి కూతురును, అల్లుడిని రమ్మని పిలవాలికానీ మీ అమ్మ రావడమేమిటి?''

''ఒక్క రోజు పండుగకు అంతదూరం వెళ్ళటం ఛార్జీలు దండగని అన్నారుగా. అందుకని మనలను చూడటానికి వాళ్ళే వస్తున్నారు.''

''ఇందాక మీ అమ్మ అన్నావు. ఇప్పుడేమో వాళ్ళు అంటున్నావు.''

''మా నాన్నగారు పండక్కి ముందురోజు వస్తారు. రేపు మా అమ్మ, తమ్ముడు వస్తున్నారు.''

వెంకట్రావు గుండె గుభేలు మన్నది.

''కోతి వెధవ. మళ్ళీ వాడెందుకు?'' అన్నాడు.

సుందరి గుడ్లురిమింది.

''మర్యాదగా మాట్లాడండి. మా వాళ్ళ ఊసెత్తితేనే మీకు నోరు చెలరేగిపోతుంది. వాడు నా తమ్ముడు. మీకు బావమరిది. మన బంధువర్గంలోని వాడు.'' అన్నది.

''అబ్బ. కొట్టావులే దెబ్బ'' అని సుందరి బుగ్గలు సాగదీశాడు.

''మరి రేపుదయం..'' గోముగా అన్నది.

''మరి వెళ్ళక ఛస్తానా?''

భర్తను కౌగలించుకుని ముద్దుల వర్షం కురిపించింది సుందరి.

''మరి ఇంతవరకేనా? ఇంకా...'' సుందరి నడుము చుట్టు చెయ్యివేసి అన్నాడు వెంకట్రావు.

''ఊ..చిలిపి'' భర్త బుగ్గ చిదిమి బెడ్‌రూమ్‌లోకి పరుగుతీస్తూ అన్నది సుందరి.

★★★

వాకిట్లో ఆటో ఆగగానే పరుగెత్తుకొచ్చింది సుందరి. తల్లిని, తమ్ముడిని చూడగానే ముఖం వెయ్యివాట్ల బల్బులా వెలిగింది. ఇద్దరినీ కౌగలించుకున్నది.

''అవన్నీ లోపల చేసుకోవచ్చు. పదండి.'' అన్నాడు వెంకట్రావు ఆటోను పంపిస్తూ.

''ఏంటమ్మా అలా చిక్కిపోయావు? పట్నం తిండి పడటం లేదా?'' కూతురును పరవశంగా చూస్తూ అన్నది రుక్మిణి.

''అత్తయ్యగారూ..ఎక్కడ తిన్నా అదే తిండి. కాకపోతే పుట్టింట్లో పనేమీ చెయ్యనివ్వరు. ఇక్కడైతే పనంతా తనే చేసుకోవాలి. అంతే'' అన్నాడు వెంకట్రావు.

''అప్పటికీ ఆయన కూడా చాలా సహాయం చేస్తుంటారు. కూరలు తరుగుతారు. కాఫీ డికాషన్ వేస్తారు. నీళ్ళు వేడి చేస్తారు.''

సుందరి వైపు చూసి వెంకట్రావు పళ్ళు పటపట కొరికాడు. ''అందుకనే మీ ఆయనంటే నాకు చాల ఇష్టం.'' అల్లుడి వైపు మురిపెంగా చూస్తూ అన్నది రుక్మిణి.

''సరె సరె. అత్తయ్యగారూ. మీరు రెస్ట్ తీసుకోండి. నేను ఆఫీసుకెళ్ళొస్తాను.'' అన్నాడు వెంకట్రావు.

''అదేమిటయ్యా అల్లుడూ. భోజనం చెయ్యకుండానే.''

''ఇపుడు వంటెక్కడౌతుంది? ఈపూటకు మీరు తీరిగ్గా చేసుకోండి. నేను మా క్యాంటీన్‌లో తింటాను.'' బయలుదేరాడు వెంకట్రావు.

''సాయంత్రం త్వరగా రండి.'' రోజులాగే అన్నది సుందరి.

స్నానాలై భోజనాలు ముగించిన తరువాత బాతాఖానీ వేసుకున్నారు తల్లీ కూతుళ్ళు.

''అమ్మా..అన్నయ్య ఏం చేస్తున్నాడే? వదిన నీకు అనుకూలంగా ఉంటున్నదా? నీకేమైనా పని తగ్గిందా? ఇంకా గాడిద చాకిరీ అలాగే చేస్తున్నావా?'' అడిగింది సుందరి.

దీర్ఘంగా నిశ్వసించింది రుక్మిణి.

''నా ప్రారబ్ధాన్ని ఆ బ్రహ్మదేవుడు కూడా తప్పించలేడమ్మా. సుఖపడే రాత నా నుదుటన ఉండద్దూ?''

''అదేంటమ్మా అలా అంటావు? వదినె నువ్వు చెప్పినట్లు వినడం లేదా?''

''ఇదివరకటి అన్నయ్య కాదమ్మా వాడు. పెళ్ళానికి పూర్తిగా బానిసైపోయాడు. వాడు మన లోకంలోనే ఉండటం లేదు. దాన్ని పూచికపుల్ల పట్టుకోనివ్వడు. మొన్నటిదాకా వాడికొక్కడికే చేశాను. ఇపుడు ఇద్దరికి చేస్తున్నాను.'' ముఖంలో ఎక్కడలేని నిర్వేదాన్ని కనపరుస్తూ అన్నది రుక్మిణి.

''ఆ! అంతమారిపోయాడావాడు? దాని కొండముచ్చు ముఖంలో ఏముందని? కూతురు వెళ్ళిపోతుంది గదాని ఆత్రంగా కోడల్ని తెచ్చుకున్నావ్. చివరికిలా అయిందా?''

''మొన్నేమయిందో తెలుసా? పొద్దున్నే కాస్త అంట్లుతోమమన్నాను. నన్నో బ్రహ్మరాక్షసిని చూసినట్లు చూసింది. అది సమాధానం చెప్పేలోపే ''కొత్తకోడలిచేత అంట్లు తోమిస్తావా?'' అని వాడు నామీద గయ్ మని ఎగిరాడు.

సుందరి ముక్కుపుటాలు విచ్చుకున్నాయి.

''అంట్లుతోమడంలో తప్పేముంది? ఆడ పుటక పుట్టిన తరువాత అంట్లుతోమడం తప్పుతుందా? రేపు పిల్లలను కనడం నొప్పని వాడే గర్భం ధరించి పిల్లలను కంటాడా?'' ఆవేశంగా అన్నది.

''చిన్న మాట అనే వీలు లేదు. కొంచెం డబ్బు ఆదా చేద్దాం కదా అని పనిమనిషిని మాన్పించాను. దాంతో అలిగి నానా గోల చేసింది. ఇంత సుకుమారాలు మేమెన్నడైనా ఎరిగామా? రోజూ రెండు పూట్లా పాతికమందికి వండి వార్చేవాళ్ళం.''

''పనిమనిషిని మాన్పిస్తే తప్పేముంది? కూర్చోబెట్టి సేవలు చెయ్యడానికి ఈవిడేమైనా మైసూరు మహారాణా లేక జబల్పూరు జమీందారిణా? తన అన్నం తనే కలుపుకుని తింటుందా లేక ముద్దలు కలిపి నోట్లో పెట్టాలా?''

''హు.. ఆ సంబడం కూడా అయింది. మొన్నొకరోజు అన్నం కలిపి ముద్దను దాని నోట్లోపెట్టి అది సగం కొరికిన తరువాత ఆ ఎంగిలిని వీడు తింటున్నాడు. నాకు కడుపుమండిపోయింది. ఇక ఆరోజు నానాగోల! అంతా నా ఖర్మ'' నుదురుకొట్టుకుంటూ అన్నది రుక్మిణి.

''ఛీ..ఛీ పులి లాగుండేవాడిని పిల్లిని చేసింది. మరి నాన్నేమంటున్నాడు?'' అడిగింది సుందరి.

''హు..ఆయన సంగతి చెప్పు! ఆయన కూడా ఆ ఎర్రకోడలు ఏం చెపితే దానికి బుర్ర ఊపుతాడు. ఒకసారేమైందో తెలుసా?''

''ఏమయిందమ్మా?''

''ఎన్నాళ్ళ నుంచో బీపీతో నాకు నీరసంగా ఉంటున్నదని తెలుసుగా! ఒక హార్లిక్స్ సీసా తేరా అని లక్షసార్లు అడిగాను. ఎందుకు డబ్బుదండగ? కాఫీ

మానేయడం అలవాటు చేసుకో అని చెప్పేవాడు. పెళ్లాం ఒకరోజు నీరసంగా ఉంది. హార్లిక్స్ తెండీ అంటే పరుగెత్తుకెళ్ళి కిలో సీసా తెచ్చాడు. నన్ను కాఫీ మానెయ్యమన్నవాడు దాని కోసం రోజూ లీటరు పాలు ఎక్కువ పోయించు కుంటున్నాడు.''


దుఃఖం ముంచుకొచ్చింది సుందరికి.

''అంతా నీ ఖర్మమ్మా. నీ ఖర్మ. అటు కొడుకులవలనా సుఖం లేదు. కోడళ్ళ వలనా సుఖం లేదు. దాన్నసలు ఏ కీలుకు ఆ కీలు విరగ్గొట్టి మూల కూర్చోబెట్టక నెత్తినెక్కిం చుకున్నారే..!'' అన్నది.

''అసలు ఎట్లా పెంచారో దానికి ఒక్కపనీ రాదు. ఉతికిన బట్టలు ఆరవెయ్యడం, మడత వెయ్యడం రాదు. చుట్టలు చుట్టి బీరువాలో దోపుతుంది. అన్నం తిని కంచం ఎత్తదు. కుంకుడు కాయలు కొట్టడానికి బద్ధకం. రోట్లో పచ్చడి నూరడం చేతకాదు. ఇది వరకు చచ్చేట్లు పిండి రుబ్బి మీ అందరికి ఇడ్లీలు, దోసెలు చేసి పెట్టేదానినా? అది రాగానే గ్రైండర్ కొన్నాడు.''

''ఇది వరకు మిక్సీ కొనమని నువ్వు ఎన్నిసార్లు పోరావు? రోట్లో రుబ్బితే రుచిగా ఉంటుందని అనేవాడు కదూ!''

''మొన్నేమైందో తెలుసా? నా చీర ఉతకమని పొరపాటున చెప్పా. సబ్బంతా అరగదీసింది కానీ చీర మురికి కొంచెం కూడా పోలేదు. రాత్రి పూట వాడికి ఏం చెప్పిందో ఏమో, మర్నాడే వాషింగ్ మిషన్ కొనుక్కొచ్చాడు. నలభై ఏళ్ళ నుండీ అందరి బట్టలు ఉతుకుతున్నానా! కనీసం వాడు సంపాదన కొచ్చిన తరువాతైనా వాషింగ్ మిషన్ తెద్దామని వాడికి అనిపించిందా?''



సుందరిలో ఆవేశం చిక్కటిపాలు బుసబుస పొంగినట్లు పెల్లుబికింది.

''ఎందుకనిపిస్తుంది? పెళ్ళయి సంవత్సరం కాలేదు. అప్పుడే వీడు దానికి దాసోహం అంటే ఇక నీ బ్రతుకెలాగమ్మా?'' ఏడుస్తూ అన్నది.

''ఇదిలా ఉంటే దాని తమ్ముడొకడున్నాడు చూడు. ఉత్తి జులాయి వెధవ! పోరంబోకు లాగా రోడ్ల మీద తిరుగుతుంటాడు. ఆ యధవనేదో చదివించాలని ఇంట్లో తెచ్చి పెట్టింది.''

సుందరికి మండిపోయింది.

''ఆ...వాడా! పదోక్లాసు ఎన్నిసార్లు ఫెయిలయ్యాడో వాడికే తెలియదు. వాడుంటే మీకు ఇబ్బంది అనే ఇంగితం కూడా లేకుండా ఆ గాడిదకొడుకును తెచ్చిందా? ఎంత ధైర్యం దానికి? వాతలు పెట్టలేక పోయావా?'' అరిచింది.

''నేనేం ఊరుకుంటానా? ఇద్దరినీ ఛెడామడా తిట్టిపోశాను. అట్లకాడ ఎర్రగా కాల్చి దాని వీపుమీద పెడదామనుకున్నా కానీ సమయానికి అట్లకాడను పక్కింటి వాళ్ళు తీసుకెళ్ళారు. పెళ్ళాం ముందు అరిచానని రోషం ముంచుకొచ్చి అప్పటికప్పుడే పెట్టేబేడా సర్దుకుని ఇంట్లోంచి వెళ్ళిపోయి వేరుకాపురం పెట్టారు.''

''ఆ! ఎంతపని జరిగింది? నిన్నగాక మొన్న వచ్చిన దాని కోసం తల్లిదండ్రులను వదిలేసి పోయాడా?''

''అంతవరకైతే బాగానే ఉండేది. నేనేదో దాన్ని రాచి రంపాన పెడుతున్నానని, అందువల్లనే వేరుకాపురం పెట్టామని ఊరంతా ప్రచారం చేస్తున్నారు. పెళ్ళాం చేత తల్లికి సేవ చేయించలేనివాడు ఉంటేనేం పోతేనేం అని మేమూ మనసు రాయిచేసుకున్నాం.''

''అత్తగారికి సేవ చెయ్యడం ఊరిని ఉద్ధరించడమా? దాన్ని ఏం చేసినా పాపం లేదు.'' కసిగా అన్నది సుందరి.

''పోనీలే. వాళ్ళగొడవ మనకెందుకు? మీ కాపురం ఎలా ఉన్నది? మీ ఆయన నీమాట వింటాడా?''

నవ్వింది సుందరి.

''మీ అదృష్టం కొద్దీ ఆయన మీకు అల్లుడిగా దొరికాడు. నామాట వేదవాక్కు. నన్ను పూచికపుల్ల ముట్టుకోనివ్వడు. నేను రాగానే పనిమనిషిని కుదిర్చాడు. నాకోసం మిక్సీ, వాషింగ్ మిషన్ కొన్నాడు. వారానికి రెండుసార్లు సినిమా చూపిస్తాడు.''


''ఆహాహా..నా బంగారు తల్లే. పెట్టిపుట్టావమ్మా నువ్వు. అయినా సరే. మొగుడిని చూసి మురిసిపోయి లేనిపోని పనులన్నీ నెత్తిన వేసుకోకు. కాస్త ఆయనను కూడా సాయం అడుగుతుండు.''


''సాయంత్రం వంట ఆయనే చేస్తారమ్మా. ఆయన చేసిన వంకాయ కూర తింటే అచ్చం నువ్వు చేసినట్లే ఉంటుంది. ఎంత కమ్మగా చేస్తారని!''

''నా తల్లే.. నా తల్లే..అంతా నీ పూర్వజన్మ నోములపంట! అయినా సరే! ఈ మగవాళ్ళకు ఏవీ రుచిగా చేసి పెట్టకూడదు. తిండి రుచి మరిగిన వాళ్ళకు పెళ్ళాం వంట మీద తప్ప పెళ్ళాం మీద ధ్యాస ఉండదు. నువ్వుమాత్రం ఎక్కువ పనులు చెయ్యకు. మరి మీ అత్తగారేమంటున్నారు?''

సుందరి ముఖాన్ని అసహ్యంగా పెట్టింది.

''మా అత్త అసలు మంచిది కాదు. మేం కలిసి మెలిసి ఉంటే అసలు ఓర్వలేదు. మొన్న ఒకసారి చూద్దామని వచ్చి ఇంటినిండా సామాన్లు కొన్నామని కొడుకును






తిట్టిపోసింది. అది డబ్బు దుబారా చెయ్యడమంట!''

''దాని గుణం మంచిది కాదు. కొడుకు కోడలు చిలకాగోరింకల్లా ఉంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది. సామాన్లు కొనుక్కుని సంసారం వృద్ధి చేసుకుంటున్నారన్న జ్ఞానం కూడా లేదు. వాళ్ళొచ్చినపుడు పలికీ పలకనట్లుండు.'' మెటికలు విరిచింది రుక్మిణి.

''ఆయనకు వాళ్ళమ్మ సంగతి బాగా తెలుసు. అందుకే మొన్న దాని మీద కేకలు వేశాడు. దాంతో అలిగి వెళ్ళిపోయింది.''

విరగబడి నవ్వింది రుక్మిణి.

''దాని రోగం బాగా కుదిర్చాడు. ఎంతైనా నీ మొగుడు మొనగాడు. ఆయనను మాత్రం జాగ్రత్తగా చూసుకో. కోపంలో ఏదైనా అన్నా ఎదురు మాట్లాడకు. ఆయన నీ వైపుంటే నీ అత్తలాంటి వాళ్ళు లక్షమంది వచ్చినా నీకేం భయం లేదు.'' హితబోధ చేసింది.

రెండు రోజుల తరువాత సుందరి తండ్రి వచ్చాడు. కూతురు సంసారం, ఇంట్లో సామానులు చూసి అల్లుడిని తెగ పొగిడాడు. ఇంతవరకూ తనను అలా మెచ్చుకున్న వారు ఎవరూ లేకపోవడంతో వెంకట్రావుకు అత్తమామల మీద అభిమానం కొండంతలుగా పెరిగింది.

దసరా పండుగ ఆనందంగా గడిచిపోయింది.

మధ్యాహ్నం భోజనాలు చేస్తుండగా రుక్మిణి ఒకసారి గొంతు సవరించుకున్నది.

''నాయనా వెంకట్రావ్! ఇద్దరు కొడుకులను కన్నా ఎందుకూ కొరగాకుండా పోయారు. అల్లుడివైనా నువ్వే మాకు కొడుకువి.''

''భలే వారండీ.'' నవ్వుతూ అన్నాడు వెంకట్రావు.

''నీ ప్రయోజకత్వం, సంసారం నడపటంలో నీ నేర్పు చూస్తుంటే ముచ్చటేస్తున్నది.''

వెంకట్రావు ఛాతీ డెబ్బైరెండు అంగుళాలకు పెరిగింది.

''నీ బావమరిదిని చూశావుగా. టెన్త్‌క్లాస్ ఫెయిలై ఖాళీగా ఉంటున్నాడు. ఆ పల్లెటూర్లో వాడికి ఏం పని ఉంటుంది? నువ్వంటే వాడికి ఎంతో భయం. భక్తి, గౌరవం...''

వెంకట్రావు శరీరం ఆంజనేయుడి వాలంలా పెరిగిపోతున్నది.

''భయభక్తులు లేనిది ఏ విద్యారాదు. మా భయం వాడికి ఎటూ లేదు. వాడిని దారిలో పెట్టాల్సిన బాధ్యత నీదే నాయనా.''

''వండి పెట్టడానికి నాకేం బాధలేదమ్మా. కానీ ఆయన చాలా క్రమశిక్షణ, సిద్ధాంతాలు కలిగిన వారు. ఆయన దగ్గర ఉండటం చాలా కష్టమమ్మా.'' భర్తవైపు చూస్తూ అన్నది సుందరి.

''అందుకేనమ్మా. అల్లుడి క్రమశిక్షణ, తెలివి తేటలలో వాడికి ఆవగింజంత అబ్బినా దారిలో పడతాడని మా ఆశ.'' వెంకట్రావు వైపు ఓరకంట చూస్తూ అన్నది రుక్మిణి.

వెంకట్రావు ఇక ఆగలేకపోయాడు.

''దాందేముంది అత్తయ్యగారూ. రెండేళ్ళు నాదగ్గరుంటే నేను ఏదొకదారి చూపిస్తాను.'' అనేశాడు.


''మా నాయనే. కానీ మీ వాళ్ళేమైనా అనుకుంటారేమోనని మా భయం.''నసిగింది రుక్మిణి.

''భలే వారే. నేను నా సంపాదన మీద బ్రతుకుతున్నాను. అయినా పరాయి వాళ్ళేమీ నా దగ్గర ఉండటం లేదుగా. ఒకవేళ మనసులో ఏమైనా అనుకున్నా నేను సర్ది చెప్పుకుంటాను లెండి.''

''ఇక మనవాడి గురించి మనం నిశ్చితంగా ఉండొచ్చు. నా అల్లుడి చేతిలో వాడు రత్నమౌతాడు.'' పెద్దగా నవ్వుతూ అన్నాడు సుందరి తండ్రి.

మరునాడు అత్తమామ లిద్దరినీ ఆటోలో స్టేషన్ వద్ద దించి వచ్చాడు వెంకట్రావు.

★



## సౌందర్యకి బాడ్‌నేమ్



కాల్‌షీట్స్, డేట్స్ సరిగ్గా పాటించక పోవడంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని సౌందర్యను బుక్ చేసుకున్న నిర్మాతా దర్శకులు వాపోతున్నారు. అయితే సౌందర్యకు ఈ విధంగా బాడ్‌నేమ్ రావడానికి కారణం ఆమె అన్నయ్యేనట. తండ్రి చనిపోయిన తరువాత సౌందర్య రేట్లు, డేట్లు లాంటి వ్యవహారాలను ఆమె అన్నయ్యే చూస్తున్నాడు. ఈ విషయంలో ఆయనకు అవగాహన లేకపోవడం వల్ల తన బాధ్యతని సక్రమంగా నిర్వహించలేకే సౌందర్యకి చెడ్డపేరు వస్తుందిట. ఇక నుంచైనా సౌందర్య జాగ్రత్తపడితే మంచిదని నిర్మాతా,దర్శకులు భావిస్తున్నారు.

-ఎన్. శివానంద్